క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.


విద్యార్థుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు



పాఠశాల సందర్శనలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రత్యేక అధికారి సరోజిని

పరవాడ: విశాఖలో శనివారం నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే పాఠశాల విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ మండల ప్రత్యేక అధికారి ఎన్.సరోజిని ఉపాధ్యాయులకు సూచించారు. తానాం, పరవాడ జెడ్పీ స్కూళ్లను ఆమె శుక్రవారం సందర్శించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. యోగాంధ్రలో పాల్గొనే విద్యార్థులకు అవసరమైన తాగునీరు, భోజనం తదితర సదుపాయాలను కల్పించాలన్నారు. ఆమె వెంట జనసేన మండల ప్రధాన కార్యదర్శి వర్రి పరదేశినాయుడు, ఉపాధ్యక్షుడు వెన్నల నరసింహరావులు ఉన్నారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాత లు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసి పూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

రేపు భువనేశ్వరీదేవి అధివాస మహోత్సవం



భువనేశ్వరి అమ్మవారు

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా యాతపాలెంలోని చెల్లాయమ్మతోటలో వేంచేసిన భువనేశ్వరీదేవికి ఈ నెల 22న దేవకాంచన పత్రితో అధివాస మహోత్సవం నిర్వహించనున్నట్టు భువనేశ్వరీదేవి ఆరాధన పీఠం, ఓం భువనేశ్వరీ సంస్థాన్ ట్రస్ట్ నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం పండితులు, పెద్దలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, సుగంధ ద్రవ్యాలతో మంగళ స్నానం జరుగుతుందని, భక్తులు చీర, జాకెట్టు, రామఫలం, తమలపాకు తదితరాలతో పూజలు చేసుకోవచ్చని చెప్పారు.

యోగ ‘ముద్ర’

- స్టాంపులు, నాణేల్లో దేశ వారసత్వ సంపద
- అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా గురించి వివరిస్తున్న స్టాంపుల సేకర్త రమణమూర్తి
- 50 ఏళ్లుగా స్టాంపులు, నాణేల సేకరణ





2015లో యోగాడే సందర్భంగా ప్రత్యేకంగా విడుదల చేసిన సాంపు



2016లో విడుదలైన సూర్యనమస్కారాల స్టాంపులు



2015లో ప్రత్యేకంగా విడుదల చేసిన రూ.10 కాయిన్

గోపాలపట్నం: అంతర్జాతీయ యోగా దినోత్సవం రికార్డు స్థాయిలో విశాఖలో నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతుండడం విశాఖ వాసులు గర్వించే రోజు అని భావించవచ్చు. ఈ సందర్భంగా పలువురు తమ వంతుగా యోగా డేకి మద్దతు పలుకుతున్నారు. జీవీఎంసీ 52వ వార్డు కరాసాలో ఉంటున్న విశ్రాంత ఉద్యోగి జామి రమణమూర్తి యోగా దినోత్సవం సందర్భంగా తన వద్ద ఉన్న యోగా స్టాంపుల ద్వారా యోగా గురించి వివరిస్తున్నారు. ఆయనకు స్టాంపులు, కరెన్సీ, కాయిన్లు సేకరించడం అలవాటు. వాటి ద్వారా మన చరిత్ర విద్యార్థులకు వివరిస్తుంటారు. 50 ఏళ్ల నుంచి వీటిని ఆయన సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు 200 దేశాలకు చెందిన 30 వేల స్టాంపులు సేకరించారు. 120 దేశాలకు చెందిన 800 కాయిన్లు సేకరించారు. 2015లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం పలు స్టాంపులు, ఒక కాయిన్ కూడా విడుదల చేసింది. వాటిని రమణమూర్తి సేకరించారు. యోగా భారతీయ సాంప్రదాయం. చాలా మంది భారతీయులు యోగాను దినచర్యలో భాగంగా ప్రతిరోజూ చేస్తుంటారు. సూర్య నమస్కారాలు కూడా చేస్తారు. రమణమూర్తి సేకరించిన స్టాంపుల్లో సూర్యనమస్కారాల స్టాంపులు ఎక్కువగా ఉన్నాయి.



2022లో విడుదల చేసిన ప్రత్యేక పోస్టల్ కవర్



1991లో విడుదలైన యోగాసనాల స్టాంపులు

> **విజ్ఞానం అందించేవి స్టాంపులు.. నాణేలు**
>
> 
>
> స్టాంపులు సేకరించడం హాబీగా కాకుండా విజ్ఞానాన్ని అందించే సాధనాలుగా చూస్తాను. ప్రతి స్టాంపు మనకొక సందేశం అందిస్తుంది. నాటి కాలాన్ని, అప్పటి పరిస్థితుల్ని మనకు విశదీకరిస్తుంది. రీసెర్చ్ చేసేందుకు ఇవి ఎంతగానో దోహదపతాయి. నేను తెలుసుకున్న విశేషాలు ప్రదర్శన ద్వారా పలువురికి అందించడం అలవాటుగా మార్చుకున్నాను. ఫిలాటెలిక్ సొసైటీ ఆఫ్ విశాఖపట్నంలో లైఫ్ మెంబర్‌గా సేవలందిస్తున్నాను. యోగా డే గురించి చాలా సార్లు వివరించాను. ఇది నాకెంతో సంతృప్తినిస్తుంది.
>
> – జామి వెంకట రమణమూర్తి, స్టాంపుల సేకరణదారు, కరాసా

అనాథలకు భోజనాల వితరణ



పిల్లలకు భోజనాలు వడ్డిస్తున్న శేషురామకృష్ణయాదవ్

మల్కాపురం: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త చెల్లిబోయిన శేషురామకృష్ణయాదవ్ శుక్రవారం పలువురు మానసిక రోగులు, అనాథ పిల్లలకు భోజనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. స్థానిక నాయకుడు త్రినాధ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

ఆంక్షలు.. అవస్థలు!

- బారులు తీరిన వాహనాలు
- విధులకు హాజరు కాలేకపోయిన ఉద్యోగులు



షిప్‌యార్డ్ సెంటర్ నాలుగు వైపులా నిలిచిన వాహనాలు

యోగాంధ్ర కార్యక్రమం వాహనదారుల సహనానికి పరీక్ష పెట్టింది. ట్రాఫిక్ ఆంక్షలతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ప్రజలు అవస్థలు పడ్డారు. ఎక్కడ పడితే అక్కడ గంటల తరబడి సేవా మార్గాలపై వాహనాలు నిలిపేయడంతో విధులకు వెళ్లలేక చాలా మంది ఉద్యోగులు వెనుదిరిగారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ శనివారం సాయంత్రం నగరానికి చేరుకున్న సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా మల్కాపురం స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం నుంచి ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. దీంతో పలు ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ పెద్ద ఎత్తున నిలిచింది. సింధియా మీదుగా నగరానికి వెళ్లే వాహనాలను షిప్‌యార్డ్ సెంటర్ వద్ద నిలిపారు. దీంతో సుమారు కిలో మీటరు వరకు పలు వాహనాలు నిలిచిపోయాయి.దీంతో ఉదయం విధులకు వెళ్లే ఉద్యోగులు చేసేది లేక తమ వాహనాలను పక్కన పెట్టి సేవా మార్గంపై నడుచుకుంటూ వెళ్లారు. శనివారం ఉదయం వరకు సమస్య ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. నగరానికి వెళ్లాల్సిన వారు జింక్ మీదుగా మింది,బీహెచ్‌పీవీ నుంచి మారుతీ సర్కిల్ మీదగా నగరానికి చేరుకోవాలని సూచిస్తున్నారు. మల్కాపురం



పారిశ్రామిక ప్రాంత సేవా మార్గంలో భారీగా నిలిచిన వాహనాలు



వాహనాలు నిలిచిపోవడంతో డివైడర్‌పై నడుచుకుని విధులకు వెళ్తున్న మహిళలు



వాహనాన్ని విడిచి నడిచి వెళ్లేందుకు సిద్ధపడ్డ మహిళ

యోగాతో మానసిక దృఢత్వం



యోగా చేస్తున్న సెయింట్ ఆన్స్ విద్యార్థినులు

మల్కాపురం: యోగా చేయడం వల్ల మానసిక దృఢత్వం ఏర్పడుతుందని,అది వ్యక్తిత్వ వికాసానికి దారి తీస్తుందని మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల అధ్యాపకురాలు, యోగా శిక్షకురాలు ఎ.ఆదిలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగా వల్ల క్రమశిక్షణ అలవడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఈ.పి.ఎస్.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం..

గోపాలపట్నం: యోగా సాధన చేస్తే మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగు పడుతుందని యోగా గురువు జగన్నాథరావు అన్నారు. జీవీఎంసీ 92వ వార్డు హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా డే సందర్భంగా శుక్రవారం యోగాసనాలు వేశారు. శనివారం జరిగే గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డు కార్యక్రమంలో అందరూ స్వచ్ఛందంగా పాల్గొవాలని కోరారు. పీడీ పుణ్యవతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



హెచ్‌సీ వెంకటాపురంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

మరుగుదొడ్లనూ వదలని మందుబాబులు

ఫోకస్

మందుబాబులు ఇంత కాలం వైన్‌షాపుల ముందు, ఫుట్‌పాత్‌లపైన, సేవామార్గాలపై మద్యం సేవించటం చూశాం. కానీ ఇప్పుడు సులభ్ కాంప్లెక్స్‌ను కూడా వారు విడిచిపెట్టడంలేదు. దీన్ని బట్టి చూస్తే మద్యం మత్తు ఎంత వరకు అయినా తీసుకెళ్తుందని అర్థమవుతుంది. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రధాన సేవా మార్గంపై ఉన్న కృష్ణ బార్ అండ్ రెస్టారెంట్ వెనుక గల సులభ్ కాంప్లెక్స్ వద్ద శుక్రవారం రాత్రి ఓ వ్యక్తితో పాటు మరి కొంత మంది మద్యం గ్లాసులు పట్టుకుని వచ్చారు. అది సులభ్ కాంప్లెక్స్ అని తెలిసినా అక్కడి దుర్గంధాన్ని పట్టించుకోకుండా మద్యం సేవించారు.

– మల్కాపురం



గజిబిజి.. గందరగోళం

- గంటకో నిర్ణయం... పూటకో ఆదేశం
- విద్యార్థులు, ఉపాధ్యాయుల అయోమయం

అగనంపూడి: నెలన్నర నుంచి ఒకేటా హడావుడి. పది రోజుల నుంచి సమీక్షలు, వెబెక్స్‌లు, సమావేశాల పేరుతో గందరగోళం. నాలుగు రోజుల నుంచి గంటకో నిర్ణయం... పూటకో ఆదేశంతో ఉపాధ్యాయులు, ఇతర విభాగాల సిబ్బంది, అధికారుల ఉరుకులు, పరుగులు.. భారీ ఎత్తున విద్యార్థులను యోగాంధ్ర కార్యక్రమానికి తరలించడానికి నానా హైరానా.. సాధారణ ఎన్నికల్లో కూడా కానరాని హడావుడి ఈసారి యోగాంధ్ర కార్యక్రమంలో కనిపించింది. జిల్లా, మండల స్థాయి అధికారులకు నాలుగు రోజుల నుంచి కంటినిండా కునుకు లేదు. కడుపునిండా తిండి లేదు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని పరుగులు పెట్టిస్తూ శుక్రవారం రాత్రి వరకు ఒక స్పష్టమైన విధానానికి ఉన్నతాధికారులు రాకపోవడంతో అన్ని విభాగాలు నానా హైరానా పడ్డారు. శుక్ర, శనివారాల్లో పాఠశాలలకు శెలవని, కాని యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా పిల్లలతో ఉపాధ్యాయులు ఆసనాలు వేయించా లని ఒక రోజు.. శనివారం ఉదయం 6నుంచి 8 వరకు యోగాంధ్ర కార్యక్రమం విధిగా పాఠశాలల్లో నిర్వహించాలని సూచించారు. తర్వాత అల్పాహా రం అందివ్వాలని, మధ్యాహ్నం భోజనం తర్వాత పాఠశాలలు విడిచిపెట్టాలని మరోక్షణం... కొద్ది గంటల్లో నిర్ణయం మార్చుకొని ఉదయం పిల్లలు, ఉపాధ్యాయులు హాజరై యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించి ఇంటికి పంపించేయాలని పేర్కొన్నా రు. ఇలా అధికారులకే ఒక పటిష్టమైన నిర్ణయం, అభిప్రాయం లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు గజిబిజీ గందరగోళంతో వాట్సాప్ గ్రూపుల్లో, ఫోన్లతో కుస్తీ పడాల్సి వచ్చిందని అన్ని వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

ఘనంగా గణపతి ఆలయ వార్షికోత్సవం



గణపతిని దర్శించుకుంటున్న అదీప్‌రాజ్, నాయకులు

పెందుర్తి: మండలంలోని రాజయ్యపేటలో కొలువుదీరిన వినాయకుడి ఆలయం 14వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గణపతికి ఉదయం నుంచి అభిషేకాలు, పూజలు జరిపారు. మధ్యాహ్నం జరిగిన భారీ అన్నసమారాధనలో దాదాపు 2 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, నాయకులు మధుపాడ అంజి, మొల్లంపాక దిలీప్‌కుమార్, నక్క మహేష్, ఈసరపు గోవింద్, పిల్లా సాయిసీతారాం పాత్రుడు, రాయవరపు జగన్, ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు గణపతిని దర్శించుకున్నారు.


యోగాంధ్రాకు 12వేల మంది జూనియర్ కళాశాల విద్యార్థులు

మద్దిలపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుంచి 12,800 మంది విద్యార్థులు ‘యోగాంధ్ర’ కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి మురళీధర్ తెలిపారు. వీరిని తరలించడానికి 238 బస్సులు కేటాయించారు. ప్రతి బస్సుకు ఒక జూనియర్ లెక్చరర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. అలాగే 19 మంది ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌లను నోడల్ అధికారులుగా నియమించారు. 88 బస్సులలో 4,466 మంది ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రౌండ్‌లో జరిగే ‘యోగాంధ్ర’ కార్యక్రమంలో 4 కంపార్ట్‌మెంట్లలో పాల్గొంటారు. వీరికి ఏడుగురు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాళ్లు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు.

విద్యార్థి మిత్ర కిట్లు.. కొన్ని కట్

కిట్లలో కనిపించని షూ, సాక్సులు

పెదగంట్యాడ: పాలశాలలు తెరిచి వారం గడిచినా పూర్తి స్థాయిలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను అందించలేదు. బడి తెరిచిన మొదటి రోజే విద్యార్థులందరికీ కిట్లు పంపిణీ చేస్తామని కొద్ది నెలలుగా ఊదర గొట్టిన కూటమి ప్రభుత్వ పెద్దల మాటలు ఉత్తమాటలేనని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థి మిత్ర కిట్లు పేరుతో యూనిఫాం, బెల్టు, నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు, బ్యాగు, బూట్లు, సాక్సులు, డిక్షనరీలు అందిస్తామని పదే పదే ప్రకటనలు గుప్పించారు. కానీ పాఠశాలలు తెరిచి వారం గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి స్థాయిలో అందించలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .



పూర్తి స్థాయిలో లేని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్లు

గత వైఎస్సార్‌సీపీ హయాంలో..

కూటమి పాలనకు భిన్నంగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద పిల్లల విద్యకు పెద్దపీట వేశారు. బడి వైపు వారిని మరింత ప్రోత్సహించేలా జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. మునుపెన్నడూ లేని విధంగా విద్యార్థులకు అవసరమైన ప్రతి వస్తువును కిట్ల విద్యార్థి కిట్లు రూపంలో పాఠశాలలు తెరిచిన మొదటి రోజే అందజేసేవారు. ఈ సారి అందుకు భిన్నంగా కిట్ల పంపిణీ జరుగుతోందని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గాయత్రి ఆలయ వార్షికోత్సవాలకు అంకురార్పణ



అభిషేకానికి సిద్ధం చేసిన కలశాలు

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని శ్రమశక్తినగర్‌లో కొలువుదీరిన పంచముఖ గాయత్రిమాత ఆలయ 15వ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు సుప్రభాత సేవ, కలశాభిషేకం, అలంకరణ, సర్వదర్శనం, వేదపారాయణం, లలితా సహస్రనామం, హనుమాన్ చాలీసా పారాయణం జరిగాయి. ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రెండోరోజు శనివారం సుప్రభాత సేవ, లలిత సహస్ర నామార్చన, అష్టోత్తర నామ పారాయణ, హనుమాన్ చాలీసా, సాయంత్రం ఊయల సేవ, దీపాలంకరణ, గాయత్రీ హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త సరస్వతుల నరసింహమూర్తి తెలిపారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి అనకాపల్లికి చెందిన చాగంటి కుక్కుటేశ్వరరావు రూ.లక్ష, కాకినాడకు చెందిన కస్తూరి జగన్నాథరావు రూ.లక్ష 120 విరాళాన్ని అందించారు. సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో ప్రోటోకాల్ విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు విరాళాన్ని చెక్కు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరపున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేష వస్త్రాలను అధికారులు అందించారు.